## వైకాపా హయాంలో

# కుంటుపడిన గ్రామాల అభివృద్ధి

## – మంత్రి డోలా భాల వీరాంజనేయ స్వామి





**పెన్ పవర్ తర్లుపాడుజులై 19:**

గత వైకాపా ప్రభుత్వం హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. తర్లుపాడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. ముందుగా మండల కేంద్రమైన తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు గదులను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, డీఎంహెచ్వో వెంకటేశ్వర్లు తో కలిసి ప్రారంభించారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్సీ పాలెం లోని నివాసాలకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలు గురించి వివరించారు. అనంతరం మండలంలోని సీతా నాగులవరం గ్రామంలో నూతనంగా 25 లక్షలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రతి గ్రామంలో లక్షల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు.పశ్చిమ ప్రాంత ప్రజల కల వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే, జాతికి అంకితమిచ్చినట్లు అసత్య ప్రచారం చేసిందని వైసిపి పై మండిపడ్డారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి, మార్కాపురం జిల్లాగా ప్రకటించి కూటమి ప్రభుత్వ నిబద్ధతను చాటుకుంటామని తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకం హామీల్లో భాగంగా ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనంతో ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి లబ్ధి చేకూర్చామన్నారు. వితంతువులకు, వృద్ధులకు,పెన్షన్ ను రూ.3000 నుంచి నాలుగు వేలకు, దివ్యాంగులకు రూ.4000 నుంచి రూ.6000, కిడ్నీ కాలేయం తల సేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు పదివేల రూపాయలు, పూర్తి వైకల్యం వున్నవారికి రూ. 15000 మొత్తంగా రాష్టంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నామన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతో పాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు త్వరలోనే అందిస్తామన్నారు. అన్న క్యాంటీన్లను పనులు గురించి కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ఒకే సంవత్సరం పరిపాలనలో రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేయబోతున్నట్లు తెలియజేశారు. అతి త్వరలో ఎస్సీ ఎస్టీలకు మూడు లక్షల 50 వేల రూపాయలు, బీసీలకు మూడు లక్షలు, ఓసీలకు రెండు లక్షల 50 వేల రూపాయలతో ఇంటి నిర్మాణాలు చేపట్టి వారికి అందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సర కాలంలోనే ఇన్ని బృహత్తర కార్యక్రమాలు చేపడుతుంటే, ఈ సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి వైకాపా నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి శ్రేణులు వైసిపి తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, తర్లుపాడు ఎస్సై బి.బ్రహ్మనాయుడు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మా సమస్యలను పరిష్కరించండి సారూ...

తర్లుపాడు మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి విచ్చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని మా గ్రామాలలోని పలు సమస్యలు పరిష్కరించమంటూ ప్రజలు వినతులు సమర్పించారు.ముందుగా మండల కేంద్రమైన తర్లుపాడులో అసంపూర్తిగా ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని తక్షణమే పూర్తి చేసి మా కష్టాలను తొలగించాలని మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కొందరు మా పిల్లలకు తల్లికి వందనం రాలేదని, గ్యాస్ నగదు ఖాతాలో జమ కాలేదని, అలాగే తర్లుపాడు నుండి మార్కాపురం వెళ్లే రహదారిని డబల్ రోడ్డు చేసి, ప్రమాదాల బారిన పడకుండా రక్షించాలని, మరికొందరు పింఛను సమస్యలు పరిష్కరించాలని, నీటి సమస్యను పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. మంత్రి స్వామి సానుకూలంగా స్పందించి త్వరలోనే ఈ సమస్యలన్నింటిని పూర్తి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్, తహసిల్దార్ కేకే కిషోర్ కుమార్,ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఏపీఎం రమేష్, వ్యవసాయ అధికారి జోష్ణ దేవి,రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఒక్కలగడ్డ మల్లికార్జున, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు రావి భాషాపతి రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి, మేకల వెంకట్ యాదవ్, టిడిపి ఒంగోలు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఈర్ల వెంకటయ్య, కాలంగి శ్రీనివాసులు, వేసే పోగు జాన్, నంబుల లక్ష్మయ్య, మేకల అచ్చిరెడ్డి, తాడి చలమారెడ్డి, గోసు వెంకటేశ్వర్లు, వెన్న వెంకటరెడ్డి, టిడిపి శ్రేణులు నరసింహ, తిరుపతయ్య, కోటపాటి వెంకటరెడ్డి, ఆరికట్ల వెంకటేశ్వర రెడ్డి,గౌతకట్ల సుబ్బయ్య, చిన్న కాసిం వలి, చిరంజీవి, దొడ్డ సుబ్బారెడ్డి, కుందురు చిన్నకాశిరెడ్డి, కోటిరెడ్డి, దాసు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# ప్లాస్టిక్ రహిత నగరంగా ఒంగోలు...

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్ధన్..



**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 19**

కూటమి ప్రభుత్వం ప్రతి నెల మూడొవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఒంగోలు నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ట్రంక్ రోడ్డు మీదగా అద్దంకి బస్ స్టాండ్ వరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నందు జాయింట్ కలెక్టర్, శాసనసభ్యులు బిన్ విజయ్ కుమార్ తో కలిసి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు. ర్యాలీలో ప్రతి షాప్ ని సందర్శిస్తూ షాప్ యజమానులకు ప్లాస్టిక్ వాడుకోవడం వలన వచ్చే అనర్థాలు గురించి వివరిస్తూ ప్రతి షాప్ యజమాని ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు అమ్మకూడదని నగరపాల సంస్థను ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా నిలిపేందుకు ప్రజలు, షాప్ యజమానులు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలకు బదులు బయోడిగ్రేడబుల్ వస్తువుల్ని ఎలా వాడాలో ప్రజలకు వివరించాలి అని నగరపాలక సంస్థ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.








# అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించండి

- సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లండి వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపుతారు
- గిరిజన ఆవాస గ్రామాలలో అర్హులకు ఇల్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి
- వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలి
- బడి ఈడు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలల్లో ఉండేలా చర్యలు
- ఎంపీడీవోలు, ఎంఈఓలు రెగ్యులరుగా పాఠశాలలను సందర్శించాలి
- ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా






**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జులై 19**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శాసనసభ్యుల సహకారం తీసుకుని వాటిని అమలు చేయటంపై మరింతగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. శనివారం మార్కాపురంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో జరిగిన డివిజన్ లోని మండల, డివిజన్ స్థాయి అధికారుల ప్రత్యేక సమావేశంలో స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తో కలిసి ఆమె పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల పురోగతిపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి సమస్యలను జిల్లా అధికారులు పరిష్కరించాలని, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు. పథకాల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తే, వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. పి.ఎం.జన్ మన్ పథకంలో భాగంగా గిరిజన ఆవాస గ్రామాలలో అర్హులకు ఇల్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో స్థానిక అటవీ అధికారుల తరఫు నుంచి ఏమైనా జాప్యం జరిగితే డీఎఫ్ఓ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లు, పాఠశాలలు, అంగనవాడి సెంటర్లలో దోమల మందు స్ప్రే చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల వలన ప్రజలు ఎవరైనా చనిపోతే సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు ఆమెకు వివరించారు. బడి ఈడు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలల్లో ఉండేలా ఎం.ఈ.ఓ.లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. బంగారు బాల్యం అమలు, పిల్లలకు పాఠశాలల్లో ఏమైనా ఇబ్బంది కలిగితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లేలా 1098 నెంబర్ పై అవగాహన కల్పించడం, రెగ్యులరుగా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయటం వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవోలు, ఎంఈఓలు రెగ్యులరుగా పాఠశాలలను సందర్శించాలని ఆమె చెప్పారు. మార్కాపురం డివిజన్లో 4377 మంది వల్నరబుల్ పిల్లలు ఉన్నారని, వీరి అభివృద్ధి కోసం మార్గదర్శకులను గుర్తించి అనుసంధానం చేయాలని అన్నారు.



'తల్లికి వందనం' డబ్బులు జమ కావటంలో ఈ-కేవైసీ సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించి లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ కార్డు లేని చిన్నారులకు అందుకు గల కారణాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన వారికి డొమిసిల్ సర్టిఫికెట్లను తహసీల్దారులు త్వరగా ఇవ్వాలని ఆమె చెప్పారు. అలాంటి కేసులను తాసిల్దారులే స్వతహాగా గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పీ – 4 పథకంలో మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని, ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ పనులను చేపట్టడంలో మరింత పురోగతి సాధించాలని, గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూసుకోవాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఇతర డివిజన్లతో పోలిస్తే మార్కాపురంలో పురోగతి కొంత నెమ్మదిగా ఉందని, దీనిని వేగవంతం చేయడానికి ప్రజా ప్రతినిధుల సహకారంతో సంబంధిత శాఖలు సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ శ్రీ.సహదిత్ వెంకట త్రివినాగ్, మార్కాపురం, గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్లు జి సందీప్ కృపాకర్, నిషా కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# నరేంద్ర మోడీ నాయకత్వం అన్ని విధాల అందరికీ అవసరం

## బిజెపి నాయకురాలు విజయలక్ష్మి స్పష్టం





**పొదిలి, పెన్ పవర్, జులై 19**

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం భారతదేశానికి అన్ని విధాల అవసరమని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నాడు భారతీయ జనతా పార్టీ పొదిలిలో కార్యక్రమాన్ని చేపట్టింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి పట్టణంలోని చిన్న బస్టాండ్ ప్రాంతంలో వివిధ వర్గాలను కలసి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు వాటికి సంబంధించిన కరపత్రాలను కూడా అందజేశారు ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వల్ల భారతదేశం అన్ని రంగాల్లో రాణిస్తుందన్నారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రపంచ పటంలో చోటు చేసుకుంటున్నాయని ఆమె చెప్పారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దోర్నాల రమణారెడ్డి, యుద్ధం మహేష్, సయ్యద్ ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ఆర్టీసీ డిపోను అందరూ ఆదరించాలి

## పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరరావు



**పొదిలి, పెన్ పవర్, జూలై 19**

పొదిలి ఆర్టీసీ డిపోను అందరూ ఆదరించాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వి శంకరరావు కోరారు ఈ మేరకు ఆయన శనివారం నాడు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు ప్రజలకు, ప్రయాణికులకు రవాణా పరంగా సౌకర్య వంతంగా ఉండే విధంగా రూట్లలో బస్సులను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు అలాగే తమ డిపో పరిధిలోని ప్రాంతాల్లో ప్రమాణపరంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎం శంకరరావు చెప్పారు ప్రయాణికులకు రవాణా పరంగా అవసరమైన ఏర్పాట్లు చేసే కృషిలో భాగంగా సోమవారం నుండి తమ డిపో నుండి గుంటూరుకు ప్రతిరోజు 8 బస్సులను ప్రవేశపెడుతున్నట్లు డిఎం శంకరరావు చెప్పారు ఉదయం ఐదు గంటల నుండి ఆయా బస్సులు డిపో నుండి ప్రతి గంటకు లేదా ఒకటిన్నర గంట కు బయలుదేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు అందువల్ల ప్రజలు, ప్రయాణికులు రవాణా పరంగా తమ డిపోను ఆదరించడం ద్వారా సంస్థను అభివృద్ధికి తోడ్పడాలని డిపో మేనేజర్ శంకరరావు కోరారు.

# యుటిఎఫ్ ఆడహక్ జిల్లా కార్యదర్శిగా వి సాంబశివరావు

## అభినందనలు తెలిపిన యన్ వెంకట్రామయ్య, షేక్ పాదుషా

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 19**

మండల కేంద్రంలోని శీలంవారిపల్లి కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో పిజిటి, కెమిస్ట్రీ ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న వి సాంబశివరావును ఇటీవల యుటిఎఫ్ జిల్లా ఆడహక్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భముగా సిఎస్పురం మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ, సేవా మనోభావాంతో పనిచేసే సాంబశివరావుకు ఈ పదవికి ఎంపిక చేయడం గర్వకారణమని పేర్కొన్నారు విద్యారంగాన్ని, యుటిఎఫ్ శాఖ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



# ప్లాస్టిక్ వ్యర్థాలు లేని సమాజం కోసం కలసికట్టుగా కృషిచేద్దాం

## ప్లాస్టిక్ నిషేధంపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహణ.

## బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహణ.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని దుకానదారులకు అవగాహన.









**గుడ్లూరు, పెన్ పవర్, జులై 19**

ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి అనేక నష్టాలు కలుగుతాయని, ప్లాస్టిక్ వ్యర్థాలు లేని సమాజం కోసం కలసికట్టుగా కృషిచేసి, ప్రకృతిని రక్షించుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని సీఐ జీ.మంగారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్నారు. దీని ద్వారా ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకొని, ప్రతినెల ఏదో ఒక థీమ్ తో ముందుకు పోతుండగా, ఈ నెల 'ప్లాస్టిక్ కాలుష్యానికి అంతం' అను థీమ్ కు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల కేంద్రమైన గుడ్లూరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ కూడలి వరకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ,; ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ భారీ ర్యాలీ ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొనసాగింది. ముఖ్యంగా దుకానదారులకు ప్లాస్టిక్ వల్ల అనర్థాలను తెలుపుతూ, దుకాణాలలో ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. అనంతరం ర్యాలీ బస్టాండ్ కూడలికి చేరుకొగా మానవహారంగా ఏర్పడ్డారు. గుడ్లూరు సర్కిల్ సీఐ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. సీఐ జీ.మంగారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైకిల్ చేయలేని ప్లాస్టిక్లను నివారించడం, ప్లాస్టిక్కు బదులుగా వీటి స్థానంలో రీసైకిల్ చేయగల ఇతర పదార్థాలను ఉపయోగించడం వంటి చర్యలు తీసుకోవచ్చునన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుందని,;ఇది భూమిని, నీటిని కలుషితం చేస్తుందని, మానవ ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రతాపాన్ని చూపుతుందని, పర్యావరణానికి విఘాతం కలిగి ముమ్ముందు తరాల భవిష్యత్ కు సవాలుగా మారుతుందని అన్నారు. ఇప్పటికే దీని ప్రభావం ప్రస్తుతం కనిపిస్తున్నదని అన్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ సముద్రంలోకి చేరితే, జలచరాలు వాటిని తిని చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ లోని రసాయనాలు ఆహారం, నీరు, మరియు చర్మం ద్వారా మన శరీరంలోకి ప్రవేశించి, అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీయవచ్చునన్నారు. ప్లాస్టిక్ అనే పదం ఎంతో చిన్నది అయినప్పటికీ, ఇది ప్రపంచ మనుగడకు సవాలును విసురుతున్నదని అన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తి మరియు పారవేయడం గ్రీన్హౌస్ వాయువులను విడుదల చేస్తుందని, ఇది వాతావరణ మార్పులకు కారణమవుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహానికి అంతరాయం కలిగిస్తాయని, ఇది అపరిశుభ్రతకు దారితీస్తుందన్నారు.;ఇవి కేన్సరును కలుగ చేసే పదార్థాలని కలిగి ఉంటాయని, ప్లాస్టిక్ నిషేధం కొనసాగించకుంటే, భవిష్యత్ లో అది మనకు మరెన్నో సవాళ్ళను విసిరేందుకు సిద్ధంగా ఉన్నదని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు లేని రేపటి సమాజం కోసం, ఈరోజే మార్పు తెచ్చుకుందాం అని ఎంపీడీఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి.వెంకట్రావు, ఎంఈఓ గోవర్ధన్,; ప్రధానోపాధ్యాయులు రాం మోహనరావు, ఎం.ఏ.ఓ రవికుమార్, ఏపీఎం చినబాబు, ఐసీడీఏస్ సూపర్వైజర్ నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధిహామీ కూలీలు, అంగన్వాడీలు, డ్వాక్రా సంఘాల మహిళలు, వీవోఎలు, పారిశుద్ధ్య కార్మికులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దొనకొండ ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి వలసలు నివారించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్.




**దొనకొండ జూలై 19 పెన్ పవర్**

దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వలసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వివిపురంలో శనివారం వ్యవసాయ కార్మికుల సమావేశం కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సందర్భంలో దొనకొండ ప్రాంతం రాష్ట్ర రాజధానిగా మారుతుందని, తద్వారా తమ బ్రతుకుల్లో వెనుకబాటు పోయి, అభివృద్ధి సాధిస్తామని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. పాలకులు దాన్ని వదిలేసి పారిశ్రామిక కారిడార్ నిర్మించి వలసలనివారిస్తాం, వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు చూపారని అన్నారు. దశాబ్దంన్నర గడిచినా పారిశ్రామిక అభివృద్ధి ఒక్క అడుగు ముందుకు పడలేదని అన్నారు. అనేక దేశాల వాళ్లు రావడం, భూములు చూసి పోవడం తప్ప ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదని అన్నారు. వెనకబడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం, అన్నంత ముందుకు నడిపిస్తామని పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వర్షాధారం మీదనే వ్యవసాయ పనులు ఉంటాయని, వాటిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు తగిన పనులు లేక నిత్యం వలసలు పోవాల్సిన పరిస్థితిలో కొనసాగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. వలసల నివారణ, పేదరిక నిర్మూలన లక్ష్యంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని దొనకొండ ప్రాంతంలో ఏడాదికి 200 రోజులకు పనులు పెంచి, కనీస వేతనం 600 ఇవ్వడం ద్వారా వలసలు నివారించవచ్చని, ఈ ప్రాంత వెనుకబాటు నుండి ప్రజలను ముందుకు తీసుకురావచ్చు అని అన్నారు. వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయని సాగుకి యోగ్యమైన భూములను భూమి లేని ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పరిరక్షించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్నాయని వాటిని అడ్డుకోవాలని, వాహనాలు ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులన్నీ పేదలకు అందించాలని కోరారు. ఆగస్టు 12, 13 తేదీలలో కనిగిరిలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు ఈ ప్రాంతం నుంచి ప్రజల తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్య వైద్య సంస్థల నిర్మాణం జరగాలని కోరారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశల కొండ వెలుగొండ ప్రాజెక్టును గత 30 ఏళ్లుగా పాలకులు అదిగో ఇదిగో అని ఊరిస్తున్నారని అన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి 4 వేల కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఈ ప్రాంతంలో పర్యటించి ప్రకటించారని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోగా, ఏడాదిక 300 కోట్లతోటి ఎంత కాలానికి ప్రాజెక్టు పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం రెండు వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని, ఈ ప్రాంత ప్రజల త్రాగు, సాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ వెంటనే అమలులోకి తేవాలని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం దొనకొండ మండల అధ్యక్షుడుగా కొండ చిన్న ముసలయ్య, కార్యదర్శిగా కుందుర్తి చిన్న నరసింహులు మరియు రాయని చెన్నయ్య, ముసుగు నాగమణి, బెల్లం దుర్గ తదితరులతో కమిటీ ఏర్పడింది.

# సి నాగులవరం పాఠశాలలో క్లస్టర్ సమావేశం

## హ్యాండ్ బుక్స్ అందజేసిన ఎంఈఓ జె ప్రసాద్ రావు





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 19**

మండలంలోని చింతపూడి నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశం నిర్వహించారు సమావేశమునకు మండల విద్యాశాఖాధికారి జె ప్రసాదరావు పాల్గొని 1 నుండి 5 వ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 18 హ్యాండ్ బుక్స్, 1,2 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు 3 హ్యాండ్ బుక్స్,3,4,5 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 4 చొప్పున హ్యాండ్ బుక్స్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 వ తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థినీ విద్యార్థులను 6 వ తరగతులలో చేరే విధంగా చూడాలన్నారు విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించేలాగా కృషి చేయాలని కోరారు హ్యాండ్ బుక్స్ లో పాఠ్యచరణ, బోధన విధానాలు, మూల్యాంకన సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చూడాలని, విద్యార్థినీ విద్యార్థుల హాజరును 10 గంటల లోపు పూర్తిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు బూదాల డేవిడ్, పెద్దరాజుపాలెం ప్రధానోపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు, సెక్రటరీ జి శ్రీనివాసులు, ఆర్పి లు షేక్ పాదుషా, సి హెచ్ చంద్రశేఖర్ వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాలలో సరస్వతి మాత విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేసిన..కదిరి పార్థసారథి





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 19**

కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ప్రాంగణంలో కదిరి బాబురావు విద్యాసంస్థలు మరియు కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఇరగని చలపతి రావు సహకారంతో నూతనంగా సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.శనివారం విగ్రహ ఏర్పాటుకు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ -కరస్పాండెంట్ కదిరి పార్థసారథి భూమిపూజ చేశారు.పార్థసారధి మాట్లాడుతూ త్వరలో సరికొత్త రూపురేఖలు దిద్దుకున్న దివ్యమైన సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఇరగని చలపతిరావు, స్కూల్ ఛైర్మెన్ మూరం మస్తాన్ రెడ్డి,మాజీ ఎంపిటిసి యం. కాశిరెడ్డి, ఉప సర్పంచ్ తీకెనం బాబురావు, పట్నం తిరుపతయ్య,నిమ్మల శ్రీనివాసులు,నున్నా నారాయణ, ఇరగని మాధవ రావు, కత్తులపల్లి వెంకటాద్రి,సుంకరి అంజనాద్రి, ప్రధానోపాధ్యాయులు బోడే ప్రసాద్,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి చదువుకు వితరణ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 19**

సంతనూతలపాడుకి చెందిన షేక్ అబ్దుల్ గఫూర్ అనే బాలుడి తలిదండ్రులు అనారోగ్యంతో చనిపోయయారు. ఈ బాబు కుటుంబ పోషణ భారం స్కూల్ ఫీజు వృద్ధురాలు అయినటువంటి షేక్ మహబూబ్ బీ కి కష్టంగా మారింది. వారి కష్టం తెలుసుకున్న సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భారతీయుడు రాజు గోపాల్ సహకారంతో ఆ విద్యార్థి ఫీజు 16,000 రూపాయలు స్కూల్ కి వెళ్లి మండవ మురళి కృష్ణ చెల్లించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎస్కే సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛత ప్రతి పౌరుడి బాధ్యత

## - జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్










**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జులై 19**

స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వానిదే కాదని ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పీఏ ఆర్ దామోదర్ అన్నారు. ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలిసి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, ర్యాలీ నిర్వహించి, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ ను కూడా చేశారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను గుణపం, పారలతో తీసివేశారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ , స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ద్వారా మనం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐ లు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనమే పి4 పథక ప్రధాన లక్ష్యం







**పొదిలి, పెన్ పవర్, జులై 19**

పేదరికాన్ని సమాజంలో పూర్తిగా నిర్మూలించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 పథకం యొక్క ప్రధాన లక్ష్యం అని పట్టణంలోని నాలుగవ సచివాలయం పంచాయతీ కార్యదర్శి గోపి చెప్పారు శనివారం నాడు స్థానిక నాలుగవ సచివాలయంలో జరిగిన గ్రామసభ కు ఆయన అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సహా మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పి4 పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు ప్రభుత్వంతోపాటు దాతల, ప్రజల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల నే అభిప్రాయంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు అధిక సంపన్నుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని ఇమాంస కోరారు సమావేశంలో డాక్టర్ ఇమాంసతోపాటు తెలుగుదేశం నాయకులు షేక్ మస్తాన్, సుబ్బయ్య, శ్రీకాంత్, ఖాసిం పీరా, మహిళా నాయకురాలు షేక్ మెహర్ ఉన్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు

# కదిరి పార్థసారథి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 19**

ఆరవ ఐ.సి.ఎ .ఆర్ డీన్స్ కమిటీ సిఫార్సు మేరకు పాఠ్యాంశాలను క్రోడీకరించి క్రమబద్ధీకరించిన ఫండమెంటల్స్ ఆఫ్ ప్లాంట్ పాథాలజీ అనే పుస్తకాన్ని కళ్యాణి పబ్లికేషన్స్ న్యూఢిల్లీ వారిచే ముద్రించబడిన పుస్తకాన్ని శనివారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ కదిరి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలి ప్రతిని పుస్తక రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ .యన్ శంకర్ రెడ్డి పార్థసారథికి అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని రచించిన శంకర్ రెడ్డిని పార్థసారథి, కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ అభిలాష్ నాయక్, సంతోషి, డాక్టర్ అభిగ్న, ఇరగని చలపతి రావు,మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి, టి బాబురావు,కళాశాల జూనియర్ అసిస్టెంట్ ఖాసిం భాష, తదితరులు పాల్గొన్నారు.




# కూటమి ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ,బిసీల పై దాడులు

## - మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపణ

**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 19**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దారుణాలకు పాల్పడుతుందని మాజీ ఎంపీ చింతా మోహన్ ఘాటుగా విమర్శలు చేశారు . శనివారం నాడు ఒంగోలులోని ఎంసీఏ భవనం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985లో కారంచేడు లో జరిగిన అత్యాచారాలు నేటికీ ఎస్సీ ఎస్టీ ఓబీసీలపై జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దళిత అడ్వకేట్ లపై అత్యాచారం జరిగిందని తెలిపారు. ఎస్సీలు,ఓబీసీలు, ఎస్టీలు పై ఆంధ్ర రాష్ట్రంలో విపరీతమైన దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు రాజధాని పేరుతో 70 వేల ఎకరాలు రైతుల దగ్గర తీసుకున్నారని ఆ రైతులకు ఇప్పటివరకు న్యాయం చేయలేదని ఆరోపించారు. 1000 ఎకరాలు రాజధానికి సరిపోతుందని తెలిపారు. ఒంగోలు దగ్గర దొనకొండలో రాజధాని పెట్టమని శివరామన్ కృష్ణన్ కమిటీ చెప్పిందని. లక్ష ఎకరాలు ప్రభుత్వ భూములు దొనకొండ ప్రాంతంలో ఉన్నా చంద్రబాబు నాయుడుకి ఉన్న బంధు ప్రీతితో దొనకొండకు రావాల్సిన రాజధానిని రాకుండా చేసి, అమరావతిలో ప్రారంభించారని విమర్శించారు. కృష్ణా నది తీరంలో మూరెడు మట్టి తీస్తే, చారెడు నీళ్లు వస్తది. నీళ్లలో 50 అంతస్తుల సచివాలయం భవనం కడితే, భవిష్యత్తులో కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారు? దేశంలోనే కాదు, ప్రపంచంలోనే 50 అంతస్తుల సచివాలయం భవనం లేదు అని అన్నారు. విజయవాడలో అంతర్జాతీయ విమానాశ్రయం వుండగా 30 కిలోమీటర్ల దూరంలో గుంటూరులో 5000 ఎకరాల్లో మరో విమానాశ్రయం ఎందుకు అని ప్రశ్నించారు. పోలవరం, తెలుగు గంగ, కాలేరు- నగరి, హంద్రీ- నీవా, ఎస్ ఎల్ బి సి ఇప్పటి దాకా పూర్తి కాలేదు,పోలవరం ప్రాజెక్టు పూర్తికాకముందే, బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. మొబలైజేషన్ అడ్వాన్సుల్లో కమీషన్ల కోసమే



బనకచర్ల ప్రాజెక్టు అని అన్నారు. 2జి స్పెక్ట్రమ్ స్కాం, బొగ్గు స్కాం కంటే కూడా బ్యాంకు రుణాల మాఫీ స్కాం వెయ్యింతలు పెద్దది అని 14 50 లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేయగా ఇందులో లక్ష కోట్లు అవినీతి జరిగిందని ఆరోపించారు.సూత్రధారులు ఎవరు?? పాత్రధారులు ఎవరో తేల్చాలని అన్నారు.ఏపీలో 35వేల పాఠశాలలు ఉండగా ఆ సంఖ్యను పది వేలకు తగ్గించాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు.మధ్యాహ్న భోజనం సోనియా గాంధీ, యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 18 కోట్ల మంది భోజనం చేయగలుగుతున్నారు. మధ్యాహ్న భోజనం ఆపితే, పాఠశాలల సంఖ్య తగ్గిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు స్కాలర్షిప్లు సరిగ్గా రావడం లేదని పేరుకే ఎస్సీ కార్పొరేషన్లు. నిధులు లేవు. నిరుద్యోగులకు రుణాలు రావడం లేదు అని కూటమి ప్రభుత్వంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఈ కార్యక్రమంలో చింతామణి తో పాటు దళిత నాయకులు విజయేంద్ర పాల్గొన్నారు.

# డా. కూనపులి నరసింహారావు, డా. చప్పరం గురు బ్రహ్మం పేరు మీద చౌరస్తా ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కు వినతి



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జులై 19**

కనిగిరి ప్రాంతానికి వైద్యరంగంలో అనేక సేవలందించి ఎంతోమంది జీవితాలను కాపాడిన స్వర్గీయ డాక్టర్ కూన పులి నరసింహారావు, డాక్టర్ సీ హెచ్ గురు బ్రహ్మం కనిగిరి ప్రాంత ప్రజలకు సేవలకు గుర్తింపుగా వారి పేరు మీద కనిగిరి మున్సిపాలిటీ లోని ఎమ్మెస్సార్ రోడ్ లో వారి నివాస ప్రాంతాలను డాక్టర్ నరసింహారావు చౌరస్తా, డాక్టర్ గురుబ్రహ్మం చౌరస్తాలుగా గుర్తించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కనిగిరి మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణమోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర సెక్రెటరీ మారెళ్ళ ఉమా కాంత్, పురోహితుల రాష్ట్ర కార్యదర్శి తిమ్మరాజు వంశీకృష్ణ, కనిగిరి బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు అగస్య రాజు , హనుమంతరావు, వెలుగొండ బ్రాహ్మణ అన్న సత్రం ప్రధాన కార్యదర్శి చక్కిళం మురళీకృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శిలు అయినంపూడి చంద్రశేఖర్, సాదు చలపతిరావు , కమిటీ సభ్యులు ఎం హరి, కూనపులి అన్నపూర్ణమ్మ నరసింహారావు బ్రాహ్మణ కళ్యాణ మండపం కమిటీ సభ్యులు, బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు , సాధు చలపతిరావు, ప్రజా హక్కుల వేదిక కనిగిరి పట్టణ అధ్యక్షులు బత్తుల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు గాలికి వదిలిన ప్రభుత్వం

## - బనకచర్ల పేరుతో కొత్తరాగం - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ధ్వజం

**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 19**

ఒంగోలు రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు భాగస్వామ్యం తో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, అలా చేస్తే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్టేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ద్వజమెత్తారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యం ఎక్కడా లేదన్నారు. కొత్తగా ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో ప్రాజెక్టును నిర్మిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి చెప్పటాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు . గత వైసిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని కేంద్రం సూచించింది అన్నారు.. ప్రస్తుతం డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి పోలవరం ఎత్తుపై రాజకీయం చేస్తుందన్నారు.45.75 అడుగుల ఎత్తును నీటి నిల్వ చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.అలా కాకుండా 41. 5 అడుగులు మాత్రమే నీటిని నిలవ కు కేంద్రం అనుమతిస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రూ.82 వేల కోట్లతో పోలవరం బనక %జి%చర్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్తున్న ప్రభుత్వం, ప్రాజెక్ట్ పూర్తయే నాటికి అంచనా వ్యయం రెండు లక్షల కోట్లకు తీసుకెళ్తారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యాన్ని ఏ రాజకీయ పార్టీ, రైతు సంఘాలు, ప్రజలు ఎవరూ అంగీకరించరని తెలిపారు.దీనిపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను పక్కదారి మళ్లించేందుకే పోలవరం, బన చర్ల ప్రాజెక్టులను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వెలుగొండ,




హంద్రీనీవా,గాలేరు, నగరి,వంశధార,నాగవల్లి ప్రాజెక్టు తో పాటు అనేక చిన్న, మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువలు నిర్మాణానికి నోచుకోక పెండింగ్లో ఉన్నాయన్నారు.వాటిని గాలికి వదిలి కొత్త ప్రాజెక్టు పేరుతో ప్రజలను పక్కదారి మళ్లించేందుకే తెరపైకి బనకచర్ల ప్రాజెక్టు ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. లక్ష 70 వేల కోట్లు అప్పులు చేస్తే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించటం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడైనా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం సంపన్నుల కొరకు ఉపయోగపడే అభివృద్ధిననీ విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ 31 వేల కోట్లు ఇప్పటివరకు అప్పు తెచ్చారని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులు వడ్డీ కట్టడానికే సంవత్సరానికి రూ. 70 వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. అమరావతిలో మరో 30 వేల ఎకరాలు సేకరణకు, అదేవిధంగా నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు వద్ద ఇండోసోల్ కంపెనీ కి 8500 ఎకరాలు భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం బట్టి చూస్తే చంద్రబాబు నాయుడుకు భూ దాహం పట్టిందని పేర్కొన్నారు. కరేడు వద్ద మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కంపెనీకి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే సముద్ర తీరంలో వేల ఎకరాలు పంటల పండని భూములు ఉన్నాయని, వాటిని పరిశ్రమలకు కేటాయించాలని సూచించారు. ఎన్నికల ముందు అవినీతిని ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. రాష్ట్రంలో బియ్యం అక్రమ రమణా జోరుగా జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి బాగా పెరిగిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. పవన్ కళ్యాణ్ బిజెపి - ఆర్ఎస్ఎస్ భజన చేస్తూ గుడి గోపురాలు చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. దొంగలు దొంగలు ఊర్లు బంచుకున్నట్లు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప మరొకటి చేయటం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం సహజమే అయితే ఆ విమర్శలు అవతలి వ్యక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉండకూడదని రామకృష్ణ సూచించారు.ముఖ్యంగా ఇటీవల కాలంలో మహిళపై వైసిపి నాయకులు ,తెలుగుదేశం పార్టీ నాయకులు శృతి మించి విమర్శించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు.మహిళలపై చేస్తున్న విమర్శలను సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందంటారు. అలాంటి విమర్శలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్పందించి వారి పార్టీ నాయకులను కంట్రోల్ చేసుకోవాలని, లేకుంటే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. ఆగస్టు 23, 24,25 తేదీలలో ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభల్లో జరుగుతున్న రాష్ట్ర అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి అవసరమైన సంక్షేమంపై చర్చించి తీర్మానించి ప్రజల ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు,నగర పార్టీ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు,ఎ.ఐ.వై. ఆఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్ లు పాల్గొన్నారు.

# అంకభూపాలపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూలై 19**

సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని కందుకూరు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండలం అంకభూపాలపురంలో యూనిట్ ఇంచార్జ్ మరియు సీనియర్ అడ్వకేట్ పెగడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటి కి వెళ్లి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి , సంక్షేమాన్ని వివరిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లాయర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తేదేపా యువ నాయకులు ప్రగడ మోహన్ , ఎస్ఎంసి చైర్మన్ కే రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రగడ బుజ్జి, మంగమూరి రమణయ్య, మంగీ సురేష్, మంగి మహేంద్ర, మల్లెల డేనియల్ మంగి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కారక సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దు – శాసనసభ్యులు ఉగ్ర



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 19**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పల్లెలు, పట్టణాలను స్వచ్ఛందంగా అభివృద్ధి చేసుకోవాలని, కాలుష్య కారక సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వినియోగించవద్దని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కనిగిరిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి వివిధ శాఖ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం సెంటర్ వద్ద నుండి కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అక్కడే మానవహారం నిర్వహించి, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజా ప్రతినిధులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెల మూడో శనివారం ఒక్కో నినాదంతో ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అక్కడే హైవే రోడ్డులో మొక్కలు నాటారు. ఈసందర్భంగా కనిగిరి –పామూరు రోడ్డులో రహదారులకు ఇరువైపులా దశాబ్దాలుగా పూడిపోయిన డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలను జెసిబిలు, ట్రాక్టర్ల ద్వారా ఎమ్మెల్యే స్వయంగా దగ్గరుండి పూడిక తీత పనులను చేపట్టారు. కనిగిరి మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాషిణికి అభినందనలు తెలిపిన గూడంశెట్టి రవికుమార్



**సిఎస్ పురం, పెన్ పవర్ జూలై 19**

మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామంనకు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఉల్లిపాయల సుబ్బరాయుడు సతీమణి సుభాషిణి ఇటీవల కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎన్నికైన సందర్భంగా మండల జనసేనపార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డిఏ కూటమి తరపున మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారని, జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలకు చురుకుగా పాల్గొంటూ జనసేన పార్టీని బలోపేతం చేయుటకు కృషి చేశారని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ద్వారా సమస్యలను పరిష్కరించుటకు కృషి చేయాలని కోరారు జనసేన పార్టీ తరపున గుర్తించి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు రియాజ్ ,కనిగిరి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు వరికూటి నాగరాజుకు సహకరించిన తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన పార్టీ నాయకులు బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఉల్లిపాయల సుబ్బరాయుడు సతీమణి సుభాషిణి కి అభినందనలు తెలిపారు.

## మాలకొండలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**వలేటివారిపాలెం పెన్ పవర్ జూలై 19**

మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కొండపైన ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ ఆద్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగులు ముద్దు.. అని అన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మరిడి నాయుడు, ఆలయ అధికారులు, తేదేపా పార్టీ నాయకులు ఉన్నారు.

**మాలకొండ ఆదాయం..:** మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 8,54,723 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు . ఆలయ అర్చకులు గౌరి శంకర్ నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు.



# రాష్ట్ర వైసీపీ నాయకులకు అదనపు బాధ్యతలు అప్పగింత

**పొదిలి, పెన్ పవర్, జూలై 19**







రాష్ట్ర వైసీపీ నాయకులు కె.వి.రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు లకు ఆ పార్టీ అధిష్టానం అదనపు బాధ్యతలను అప్పగించింది ఈ మేరకు శనివారం నాడు వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా, సోషల్ మీడియా స్పెషల్ టాస్క్ ఫోర్స్ వైసిపి రాష్ట్ర సభ్యులుగా కొనసాగుతున్న కె.వి.రమణారెడ్డికి ప్రకాశం జిల్లా కార్యదర్శిగా వైసీపీ బాధ్యతలు కూడా అప్ప గించారు, అదేవిధంగా ఇప్పటికే రాష్ట్ర నాయకులుగా పార్టీకి సేవలు అందిస్తున్న వై వెంకటేశ్వరరావును ప్రకాశం జిల్లా కార్యదర్శి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది అదే విధంగా కొండెపి కి చెందిన బి రామారావును కూడా ప్రకాశం జిల్లా కు వైసిపి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కె.వి.రమణారెడ్డి, వెంకటేశ్వరరావు, బి.రామారావులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి, పార్టీ బాధ్యతలు మరిన్ని అప్పగించినందుకు రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా వైకాపా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా వైకాపా పరిశీలకులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి,జిల్లా వైకాపా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులకు వారు తమ కృతజ్ఞతలు తెలియజేశారు వైసీపీ పార్టీని రాష్ట్రస్థాయిలో మరింత పటిష్ట పరిచే విధంగా గట్టి కృషి చేస్తామని వారు తెలియజేశారు.

## అల్లినగరంలో పీర్ల గుండం వద్ద

# జియారత్ ఫాతెహాలు

### పీర్ల పండుగ ముగిసిన మూడవ రోజు నిర్వహించిన ఫాతెహాలు నిర్వహించిన ముజావర్లు

### కుల మతాలకు అతీతంగా తరలివచ్చి అగ్ని గుండానికి ఫాతెహాలు సమర్పించిన భక్తులు



**కొమరోలు పెన్ పవర్ జూలై 19**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామంలోని పీర్ల చావిడి ఎదురుగా గల అగ్నిగుండం వద్ద శనివారం ముజావర్లు జియారత్ ఫాతెహాలు నిర్వహించగా, ఆ కార్యక్రమంలో కుల మతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు. అల్లినగరం గ్రామంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు చిన్న సరిగేసు, పగలు సరిగేసు, పెద్ద సరిగేసులు నిర్వహించారు. 17వ తేదీ స్నానానికి తరలించే వేడుకలను (షహదత్) అత్యంత వైభవంగా, ఆనంద ఉత్సవాలతో, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ,ఆ వేడుకను తొలగించేందుకు పరిసర పంచాయతీలలోని గ్రామాల నుంచి, వైయస్సార్ కడప జిల్లా లోని పలు గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. కాగా షహదత్ కార్యక్రమంతో మొహరం వేడుకలు ముగిసిన మూడవ రోజు పీర్ల చావిడిలో, అగ్నిగుండం వద్ద జియారత్ ఫాతిహాలు నిర్వహిస్తారు. శనివారం అల్లినగరం గ్రామంలోని పీర్ల చావిడి అగ్నిగుండం వద్ద నిర్వహించిన జియారత్ ఫాతెహాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా నైవేద్యంతో తరలివచ్చి అగ్నిగుండానికి పూజలు చేసి సమర్పించారు. ఆ కార్యక్రమంలో ఈ ఏడాది మొహరం వేడుకల నిర్వహణకు ముజావర్లుగా వ్యవహరించిన ఆ గ్రామానికి చెందిన గోల్కొండ బ్రదర్స్ అబ్దుల్ సత్తార్ ,చాంద్ భాషా ,అబ్దుల్ సుభాన్, అల్లా మాలిక్,మజీద్, నాయబ్ రసూల్, రహమతుల్లా, గఫూర్, అలీ అహ్మద్,మెకానిక్ రసూల్, జిలాని, ఖయ్యూం భాష, రసూల్ తో పాటు పలువురు ముస్లిమేతర భక్తులు పాల్గొన్నారు.ఫాతెహాల కార్యక్రమం శనివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు నిరాటంకంగా సాగింది. మొహరం వేడుకల తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు జియారత్ ఫాతెహాల అనంతరం తిరుగు ప్రయాణం ప్రారంభించారు.

# బస్టాండ్‌లోని క్యాంటీన్‌లో అధిక ధరలు

### ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారీయా









**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 19**

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో కలెక్టర్ డాక్టర్ తమీమ్ అన్సారీయా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.బస్టాండ్ మరుగుదొడ్లు, పరిసరాలలో ఆపరిశుభ్రత గా ఉండడం, ప్రయాణికులకు సరైన సౌకర్యాలు లేకపోవడం చూసి కలెక్టర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా క్యాంటీన్లలో అధిక ధరలు వసూలు చేస్తున్న విషయాన్ని గమనించి, క్యాంటీన్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు నిబంధనలను పాటించడం లేదని, అధికారుల నిర్లక్ష్యాన్ని కూడా తీవ్రంగా విమర్శించారు. ఇకనైనా నియమ నిబంధన పాటించేల తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జిసిడిఓ సమాగ్రా శిక్ష ప్రకాశం డిటి కె.హేమలత దొనకొండలో పర్యటన





**దొనకొండ జులై 19 పెన్ పవర్**

మండల కేంద్రంలో జి సి డి ఓ సమాగ్రా శిక్ష ప్రకాశం డిటి కె హేమలత జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గల టైప్ 4 కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులకు గల సౌకర్యాలను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేయడం జరిగినది. త్వరలోనే విద్యార్థినులకు మిగిలిన సౌకర్యాలను ఏర్పాటుకు కృషి చేస్తామని తెల్పారు. జిల్లాలో మొదటగా ఈ వసతి గృహం ప్రారంభించి నందుకు సంతోషం కలిగించిందని చెప్పారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసర వాతావరణం పరిశుభ్రము గా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రజలపై విద్యుత్తు భారం

### స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి –సిపిఎం డిమాండ్




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 19**

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుందని సిపిఎంపార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు అన్నారు. మార్కాపురం మండల కమిటీ సమావేశం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం లో శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులో ప్రజలు వాడిన విద్యుత్ కన్నా అదనపు చార్జీలు భారం భారీగా ప్రజల నుండి వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ మీటర్లలో లో భారీగా మార్పులు రాబోతున్నాయని పిక్ అవర్ పేరుతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో అధిక బిల్లు వసూలుకు సిద్ధమవుతున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్ రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు బిగింపుకు ఆదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని, సుమారుగా 25 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం పడుతుందని ఈ భారాన్ని ప్రజల నుంచి వసూలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని, అదాని కంపెనీ లాభం కోసం ఇటువంటి చర్యలకు పూనుకోవడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రాలలో ప్రతి ఇంటికి అదాని మీటరు బిగించాలని మోడీ ప్రభుత్వం హుకుం జారీ చేస్తే రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం గుడ్డిగా సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు బిగించడానికి అంగీకరించిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలో వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం మోసపూరితమని అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, ప్రజలపై విద్యుత్ బారాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి సోమయ్య, మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, ఏడుకొండలు జి రాజశేఖర్ రెడ్డి, వై పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ వి బి ఎస్ కళాశాల వీధిలో తాగునీటి పైపు లైన్ ఏర్పాటు కు భూమి పూజ

## పైప్ లైన్ పనులను ప్రారంభించిన మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి.

## తాగునీటి పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్న వీధుల ప్రజలు.





**కొమరోలు పెన్ పవర్ జూలై 19**

కొమరోలు లోని ఎస్ వి బి ఎస్ కళాశాలకు వెళ్లే రోడ్డు కిరువైపులా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు తాగునీటి పైప్ లైన్ కు శనివారం భూమి పూజ నిర్వహించారు .ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి సోదరులు, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఎడమవైపున ఎస్వీబీఎస్ డిగ్రీ కళాశాల వరకు సిమెంట్ రోడ్డు ఉన్నది. రోడ్డుకి ఇరువైపులా అనేకమంది గృహాలు నిర్మించుకొని జీవిస్తున్నారు. అయితే రోడ్డుకి ఇరువైపులా గల వీధిల ప్రజలకు నీటి సౌకర్యం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారి సమస్యను తెలుసుకున్న ముత్తుముల సంజీవరెడ్డి తమ సోదరులు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి తెలియజేశారు .అందుకు స్పందించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి ఎస్వీబీఎస్ కళాశాల వరకు సిమెంట్ రోడ్డుకు ఇరువైపుల పై ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ప్రధాన రోడ్డు కు ఒకవైపు పైప్ లైన్ ఉన్నందువలన సదరు పైప్ లైన్ నుంచి ఎస్వీబీఎస్ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా కనెక్షన్ ఇచ్చి ఆ వీధుల ప్రజలకు నీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కోరారు. సదరు పనులను కాంట్రాక్టర్ గోరంట్లయ్యకు అప్పగించడంతో ఆయన శనివారం పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుని, భూమి పూజ కార్యక్రమానికి ముత్తుముల సంజీవరెడ్డి ఆహ్వానించారు. ఆ మేరకు భూమి పూజ అనంతరం రోడ్డుకి ఇరువైపులా జెసిబి తో కాలువలు తీసి పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 1000 మీటర్ల వరకు పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లుగా కాంట్రాక్టర్ గోరంట్ల తెలిపారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల కూటమి పార్టీల నేతలు ,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కన్వీనర్ బిజ్జాల తిరుమల్ రెడ్డి, కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని, గిద్దలూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు షేక్ హసీనా, గజ్జలకొండ నారాయణ, కాంట్రాక్టర్ ఎస్. పి. గోరంట్లయ్య, గజ్జలకొండ సత్యం, సహకార సంఘం మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు,గజ్జలకొండ వెంకటేశ్వర్లు మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బిన్నీ భాష, నాయబ్ రసూల్, తదితర నేతలు ,కార్యకర్తలు ఆ వీధి ప్రజలు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలి



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జులై 19**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి తాలుకా యూనిట్ కార్యవర్గ సమావేశం శనివారం కనిగిరి పట్టణంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల నందు ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు రామన వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశం లో సంఘం సభ్యత్వం, సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే బదిలీలపై వెళ్లిన వారి స్థానంలో నూతన కమిటి సభ్యులుగా కనిగిరి డివిజన్ విఆర్ఓ సంఘం కార్యదర్శి బసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ పి ఆర్ క్లాస్ 4సంఘం జిల్లా అధ్యక్షులు డి శామ్యూల్, ఆర్ అండ్ బి సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి రాయిజ్ బాబా, సచివాలయం శానిటరీ సెక్రటరీ డి. రాజశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా ఆర్ వి ఆర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె ఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో జిల్లా కమిటి ఆదేశాల మేరకు సంఘం సభ్యత్వం ను పెంచి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కనిగిరి తాలుకా యూనిట్ కమిటీ అధ్యక్షులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం కోశాధికారి శ్రీనివాసులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రకాశంలో ఎన్సిసి బి సర్టిఫికేషన్‌లో నూరు శాతం ఉత్తీర్ణత



**కందుకూరు పెన్ పవర్, జూలై 19:**

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ కేడెట్ కార్ప్స్ ఎన్సిసి విభాగం ఆధ్వర్యంలో బి సర్టిఫికేట్ పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. 34ఆంధ్ర బెటాలియన్ ( ఒంగోలు) నుండి సుబేదార్ ఇంద్రజిత్ హవల్దార్ సుధీర్ కుమార్ చేతులమీదుగా ఎన్సిసి విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్ రవికుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సంవత్సరం మొత్తం 30 మంది కేడెట్లు బి సర్టిఫికేట్‌ను నూరు శాతం ఉత్తీర్ణతతో విజయవంతంగా పొందడం గర్వకారణంగా నిలిచింది. వీరిలో కొందరు రాష్ట్రస్థాయి శిబిరాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. డ్రిల్, ఫిజికల్ ఫిట్‌నెస్, కమ్యూనిటీ సేవా కార్యకలాపాల్లో వీరి నైపుణ్యాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్సిసి అనేది విద్యార్థులకు జీవిత నైపుణ్యాలను నేర్పే అద్భుతమైన వేదిక. బి సర్టిఫికేట్ కేవలం డాక్యుమెంట్ కాదు ః ఇది వారి ప్రగతి మార్గాన్ని నిర్దేశించే ఓ గుర్తింపు అని తెలిపారు. కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ30 మంది కేడెట్లు తమ శ్రమ, నిబద్ధతతో ఈ అర్హతను పొందడం ఆనందకరం. ఇది వారి భవిష్యత్తులో సైనిక సేవలు, ప్రభుత్వ ఉద్యోగాల వంటి రంగాల్లో మరిన్ని అవకాశాలను తెరుస్తుంది అని తెలుపుతూ విద్యార్థులకు, సంబంధిత అధ్యాపకులకు సహాయక ఎన్సిసి సిబ్బంది - వి రవీంద్ర కు అభినందనలు తెలియజేశారు.

# ఆనికాళ్లపల్లి పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 19**

మండలంలోని ఆనికాళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జె భారతి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంను నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా చేశారు అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు శుభ్రత, పౌష్టికాహారం, వ్యాయమం, చిన్నతనంలోనే మంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని , ప్రతి రోజు చేతులు కడుక్కోవడం సమయానికి ఆహారం తీసుకోవడం వంటి అంశాలు, ప్లాస్టిక్ నివారణ గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని యన్.వి.ఎస్.అలేఖ్య, అంగన్వాడీ టీచర్ షేక్ షాహనాజ్ , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మెప్మా ట్యాబుల పంపిణీ కార్యక్రమం

## ప్రజల అభివృద్ధి కోసం మరో ముందడుగు- గౌరవ శాసన సభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ జులై 19**

గిద్దలూరు పట్టణంలో మున్సిపల్ పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా మున్సిపల్ పరిపాలన మరియు పట్టణ పేదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ట్యాబుల పంపిణీ కార్యక్రమం గిద్దలూరు మునిసిపల్ కార్యాలయం లో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా, మెప్మా పి డి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ "ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ప్రమేయాల లో భాగంగా మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత, వేగం, సమర్థత పెంపొందించడానికి మెప్మా ఉద్యోగులకు ట్యాబుల పంపిణీ చేయడం ఎంతో హర్షణీయమైన విషయం అన్నారు. ఈ ట్యాబుల ద్వారా పేద ప్రజలకు అందించాల్సిన సేవలు మరింత సమర్థవంతంగా, వేగంగా అందించబడతాయన్నారు. ఫీల్డ్ లెవెల్ మిషన్ ఫంక్షనరీస్ ద్వారా లైవ్ డేటా ఎంట్రీ, సేవల పరిపాలన, హక్కుల సదుపాయాలపై పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుంది" అని తెలిపారు. పిడి మాట్లాడుతూ, ఈ ట్యాబుల వినియోగం ద్వారా మెప్మా కార్యకలాపాల్లో వేగం పెరిగి, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందన్నారు. మహిళా సంఘాల మద్దతుతో పట్టణ పేదల బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఫీల్డ్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ






**కందుకూరు పెన్ పవర్, జూలై 19**




పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పేపర్, జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కందుకూరు పట్టణం లోని వాసవి కళ్యాణ మండపం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాసవి కళ్యాణ మండపం వద్ద నుండి ప్లాస్టిక్ వద్దు - పేపర్ బ్యాగ్ లు ముద్దు నినాదాలతో ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో మున్సిపల్ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి నెలలో మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చినారు. ప్రజలలో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే నష్టాలు వివరించేందుకు, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పేపర్ సంచులు, జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలి. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు..ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానికులకు స్వయంగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ముందుగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు,చక్కా కేశవ, ముచ్చు శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, కల్లూరి శైలజ, కరిముల్లా, జియావుద్దీన్ తదితర నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# పరామర్శ

**గిద్దలూరు పెన్ పవర్ జులై 19**

గిద్దలూరు పట్టణంలోని డి జి ఆర్ హాస్పిటల్ లో రాచర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కటికే యోగనంద్ మాతృమూర్తి ఆనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆమెను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు.. వారితో పాటు పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు.

# సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి జులై 19 పెన్ పవర్ :**

మండల కేంద్రంలో దర్శి లోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద నియోజకవర్గం లోని దాదాపు 40 మందికి 24 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహానిధి చెక్కులు పంపిణి చేసిన దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈ కార్యక్రమం లో నియోజకవర్గం లోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మరెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వర రెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు పుల్లచెరువు సత్యనారాయణ నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం ముందు మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు మోకాళ్లపై నిల్చుని మున్సిపల్ కార్మికుల సమ్మె

**గిద్దలూరు పెన్ పవర్ జులై19**

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మోకాళ్లపై నిల్చుని మున్సిపల్ కార్మికులు తమ నిరసన తెలియజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం మురళి మాట్లాడుతూ జిఒ 36 ప్రకారం వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ గ్రాట్యుటిని అమలు చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. నాణ్యమైన పనిముట్లు, చెప్పులు, దుస్తులు అందచేయాలన్నారు. కార్మికులందరికి బేషరతుగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింప చేయాలంటూ కోరారు. తమ డిమాండ్‌లను ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు డి రంగయ్య, సంటయ్య, పి పాపయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సంస్కృతి స్కూల్ లో ఇన్వెస్టిచర్ వేడుకలు







**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

పట్టణంలోని శ్రీ సంస్కృతి స్కూల్ లో పట్టాభిషేక వేడుకలో నూతన విద్యామండలి సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగరాజు, డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంబించారు. నాయకత్వ లక్షణాలు శక్తి యుక్తులతో బలమైన 800మంది యువ విద్యార్థులతో కూడి ముఖ్య అతిధిలుగా విచ్చేసిన సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగ రాజు, డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దిల్ నషీన్ కు ఘన స్వాగతం పలికారు. సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగ రాజు మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులను తీర్చి దిద్దడంలో యాజమాన్యం కృషిని అభినందించి, కొత్తగా నియమితులైన విద్యార్థి నాయకులను వారి పాత్రలు బాధ్యతలను సూచిస్తూ బ్యాడ్జ్ లు, సాషెస్ లు అందజేసి, పాఠశాల విలువలను కాపాడతామని, క్రమశిక్షణ ను విధులను చిత్త శుద్దితో నిర్వర్తిస్తామని హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఇతరులచేత ప్రతిజ్ఞ చేయించారు. డిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దిల్ నషీన్ ఇన్వెస్టిచర్ కార్యక్రమం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు జట్టు కృషి కమ్యూనికేషన్, నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెంపొందించడానికి సహాయ పడుతుందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ కొంకా చంద్రశేఖర్ ఇంతటి ప్రతిష్టాత్మక వేడుకను మన సంస్థ ప్రారంభం నుండి నిర్వహిస్తుందని, జ్ఞానం నాయకత్వ సాధనకు ప్రతీకగా నిలిచేవిధంగా మన సంస్థ వ్యవహరిస్తుందని, అడ్మినిస్ట్రేటివ్ పనితీరు విద్యార్థి మండలి ఆధ్వర్యంలోనే నిర్వహించడం సాంప్రదాయమని సమాజం పట్ల బాధ్యత, సేవ నిబద్దత మొక్క ప్రాముఖ్యతను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మహిళల భాగస్వామ్యం

తెలుగుమహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ



**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కందుకూరులో ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కందుకూరు నియోజకవర్గం తెలుగుమహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు . సమాజంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని గుర్తించి వారిని ఈకార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ఈ అవగాహన సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాలను వివరించడమే కాకుండా ప్లాస్టిక్ ప్రత్యేక వస్తువుల గురించి మహిళల్లో అవగాహన కల్పించడం జరిగింది. గుడ్డ సంచులు , పేపర్ బ్యాగులు , స్టీల్ డబ్బాలు వంటి వాటిని దయనంద జీవితంలో ఎలా అలవర్చుకోవచ్చో వివరించడం జరిగింది. ఇంటి నుండి ప్రారంభమయ్యే మార్పు సమాజంలో పెద్ద ప్రభావం చూపుతుందని స్పష్టం చేయడం జరిగింది. మహిళలను తమ కుటుంబంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమం విన్నాక మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ తీసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

## ఎన్ సి సి కి ఎంపికైన 64 మంది బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు



**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

బిఆర్ ఆక్స్ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ ,34(ఏ) బెటాలియన్ ఒంగోలువారి ఆధ్వర్యంలో శనివారం ఎన్సిసి జూనియర్ డివిజన్ లో సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్ లో ఆర్మీ ఆఫీసర్లు సుబేదార్ ఇంద్రజిత్ సింగ్, హవల్దర్ సుధీర్ కుమార్, కేర్ టేకర్ (ఎక్స్ ఆర్మీ) లక్ష్మీ నరసింహారావు లు పాల్గొని 64 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు లు ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవ వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

బ్యాంకు అఫ్ బరోడా 118 వ వార్షికోత్సవము సందర్భముగా కందుకూరు బ్యాంకు అఫ్ బరోడా బ్రాంచ్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ హాజరై బ్యాంకు అఫ్ బరోడా వ్యవస్థాపకులు సాయోజరావు గైక్వెడ్ కి ముందుగా పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఖాతా ధారులను ఉద్దేశించి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, ధనవంతులకు అవసరమాయ్యే విధముగా బ్యాంకు సేవలు అందించాలని బ్యాంకు అఫ్ బరోడా విదేశాలలో కూడా విస్తరించి సేవలు అందిస్తున్నారు అని అన్నారు. కావున బ్యాంకు అఫ్ బరోడా సేవలు కందుకూరు, పరిసర ప్రాంతాల వారు వినియోగించు కోవాలని కొనియాడారు. బ్యాంకు అఫ్ బరోడా కందుకూరు బ్రాంచ్ మేనేజర్ సుదర్శి మధుసూధనరావు మాట్లాడుతూ ఇది మా బ్యాంకు కాదు మన అందరి బ్యాంకు అని దీనిని అభివృద్ధి చేసే భాద్యత మన అందరి చేతిలో ఉంది అని అన్నారు. బ్యాంకు కు వచ్చే ఖాతాదారులకు నేను మా సిబ్బంది మంచి సర్వీస్ అందిస్తామని ఎల్లప్పుడు కస్టమర్లకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలియజేసారు. కార్యక్రమం లో బ్యాంకు సిబ్బంది పి. శ్రీనివాసులు, జయంత్ చేతన్, మౌనిక, కీర్తి దేవన్, సంసాద్ భాషా, సురేష్, బొల్లినేని నాగేశ్వరావు, తానికొండ సింహాద్రి, వెంకట శేసయ్య మహిళా గ్రూప్ మెంబెర్స్ పాల్గొన్నారు.




# శ్రీ గాయత్రి ఒలంపియాడ్‌లో ఘనంగా ఆహారయాత్ర






**కందుకూరు పెన్ పవర్, జూలై 19:**

శ్రీ గాయత్రి ఒలింపియాడ్ పాఠశాల శని, ఆదివారాల్లో విద్యార్థులకు వినోదాత్మకంగా జ్ఞానాన్ని ఇచ్చే విధంగా ఆహారయాత్ర అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా వ్యవసాయం ఆరోగ్యకరమైన ఆహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమం మూడు ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టింది వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, రైతుల జీవనశైలి, పోషకాహారాన్ని ఎలా తీసుకోవాలి. ఈ అంశాలను విద్యార్థులకు బోధించడానికి, వారు సాంప్రదాయ రైతుల వేషధారణలో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. రైతుల పట్ల గౌరవాన్ని చూపించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు రైతులు చేసిన కృషి, ఆహారం రైతు భూమిలో పుట్టి మన టేబుల్ వరకు వచ్చే ప్రయాణాన్ని అర్థం చేసుకున్నారు. ఇంటరాక్టివ్ సెషన్లు, చర్చలు, మరియు పాత్రధారణ ద్వారా విద్యార్థులు వ్యవసాయ ప్రాముఖ్యతను, అలాగే సంతులితమైన, పోషకతతో కూడిన ఆహారం తీసుకోవడంలో ఉన్న అవసరాన్ని తెలిసికొన్నారు. ఈ వారాంతపు కార్యక్రమం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండటమే కాకుండా, దేశాన్ని పోషించే రైతుల పట్ల గౌరవాన్ని పెంపొందించింది. శ్రీ గాయత్రి ఒలింపియాడ్ పాఠశాల విభిన్న అనుభవజ్ఞాన కార్యక్రమాల ద్వారా సమగ్ర వ్యక్తిత్వాన్ని కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. ఈ కార్యక్రమంలో గాయత్రీ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ సిహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్ , ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీలో సీట్లు సాధించిన ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు




**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

పట్టణంలోని బి ఆర్ ఆక్స్ ఫర్డ్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ లో జాతీయ స్థాయి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ముగ్గురు విద్యార్థులు జోసా-2025 కౌన్సిలింగ్ ద్వారా ఐఐటీలలో సీట్లు సాధించారు. ఒక విద్యార్థి ఎన్ఐటి లో సీట్ సాధించాడు. ఆముదాలపల్లి విష్ణు ప్రియ (ఐఐటీ గౌహతి ),షేక్ జబీర్ సుల్తాన్ (ఐఐటి పాట్నా) ,పాలకీర్తి అశోక్ (ఐఐటి ఖరగ్ పూర్), కాటా వేణు గోపాల్ ఎన్ఐటి పాట్నా లో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినీ,విద్యార్థులను,ఉపాధ్యాయులను ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కర రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు లు ప్రత్యేకంగా అభినందించారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాల కొరకు అవగాహన




**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ పి శ్రీనివాసరావు శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ టీచర్లందరికీ ఓపెన్ స్కూల్ ప్రాధాన్యత ఓపెన్ స్కూల్ లో ఎలా విద్యార్థిని చేర్చాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఇందులో భాగంగా ఉదయము కందుకూరు మండలం ఎంఈఓ కె సుబ్బారెడ్డి బాయ్స్ హై స్కూల్ విద్యార్థుల తోటి అవగాహన ర్యాలీ నిర్వహించారు . బడి బయట ఉన్న విద్యార్థులు అనగా 14 సంవత్సరములు దాటిన విద్యార్థులు అందరూ కూడా ఓపెన్ స్కూల్లో చేరాలని తెలియజేశారు ఓపెన్ స్కూల్లో చదివి ఎంతోమంది చిన్న చిన్న ఉద్యోగాలు సంపాదించడం జరిగింది . ప్రతి ఒక్కరూ ఓపెన్ స్కూల్ ని సద్వినియోగం చేసుకోవాలని స్టడీ సెంటర్లో ఏఐ కోఆర్డినేటర్లు సంప్రదించాలని తెలియజేశారు. ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ చిత్తారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఓపెన్ స్కూల్ చదివినటువంటి లెర్నర్స్ ఎంతోమంది ఉద్యోగాలు సంపాదించి వివిధ డిపార్ట్మెంట్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ పి శ్రీనివాసరావు, కందుకూరు మండల ఎంఈఓ కె సుబ్బారెడ్డి, పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు కే రమణయ్య, క్లస్టర్ సెక్రటరీ దామా కొండప నాయుడు, ఓపెన్స్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సిఆర్టి రమణారెడ్డి ఇరువురు కలిసి ఓపెన్ స్కూల్ బ్రౌజర్, ప్రాస్పెక్టర్స్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఉపాధ్యాయులు తదితరులు హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# నారా బాబు కాదు మోసం చంద్రబాబు

మోసం గ్యారంటీకి చంద్రబాబు జిరాక్స్ కాపీ, మాజీమంత్రి.. కారుమూరి

అరెస్ట్ లతో, కేసులతో జగనన్న అభిమానాన్ని ఆపలేరు.. జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు బుచేపల్లి శివప్రసాద్ రెడ్డి

బాప్ ఏక్ నెంబర్, బేటా దోనెంబర్ అబద్దాలకు అచ్చు బొమ్మ అబ్బకొడుకులు.. అధికారప్రతినిధి శ్యామల

ప్రజలు ఎన్నికల హామీల మోసం తెలుసుకున్నారు, 2029లో జగనన్నే ముఖ్యమంత్రి..భూచేపల్లి వెంకాయమ్మ

భూతు పుస్తకానికి దేవుడి బొమ్మ అట్టావేసిన కూటమి పాలన..ఎమ్మెల్యే తాటిపర్తి











**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ జులై 19**

రాష్ట్ర ప్రజలను అబద్దాల మాయాజాలంతో అమలుకాని హామీలు గుప్పించి. గద్దెనెక్కిన నారా చంద్రబాబు నాయుడు మోసం చంద్రబాబు బాబుగా నిలిచిపోయాడని, అబద్దాలు, నయవంచన, మోసం చంద్రబాబు నైజం అని వైస్సార్సీపీ రాష్ట్ర నాయకులు దుయ్యుపట్టారు. శనివారం పట్టణంలోయర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయి విశ్రుతసమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ముందుగా వైస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆనంతరం వైష్ణవిగార్డెన్ లో జరిగిన సమావేశంలో పలువురు రాష్ట్ర నాయకులు మాట్లాడారు. ఈ సందర్బంగా మాజీ మంత్రి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరివెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు అబద్దాల హామీలు గుప్పించిన చంద్రబాబు గెలిచి గద్దె నెక్కినాక హామీలు తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేసాడని, అమ్మవడి పథకం సృష్టి కర్త జగనన్న అయితే అయన కొడుకు ఆ పథకానికి మూలకారణం అనిచెప్పడం సిగ్గుచేటని ఈ విషయం ప్రతి మహిళమా తల్లికి తెలుసనీ అన్నారు. మతి తప్పిన వాళ్ళుకూడా ఇలా అబద్దాలు. మోసం చేయరని చంద్రబాబుమోసం గ్యారంటీ అని రుజువుచేసాడని విమర్శించారు. దర్శి ఎమ్మెల్యే జిల్లా వైస్సార్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి %రీనీరిఖీబి% ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పొత్తుల ఎత్తులతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమంమరచి రెడ్ బుక్ రాజ్యాంగంతో అరెస్టులు. దొంగ కేసులతో వైసీపీ నాయకుల ను భయభ్రాంతులను చేస్తుందని, అక్రమ కేసులకు అరెస్టులకు ఏ ఒక్క నాయకుడు, కార్యకర్త బయపడదని ఓవెత్తున ఎగిసి పడే కెరటంల జగనన్న జెండా వదలమని అన్నారు. ఏడాదిలోనే నీ నయవంచకపాలన ప్రజలకు తెలిసిపోయిందని నీ ష్యురిటీమోసానికి గ్యారంటీ అని అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లారని, ప్రతి ఇంటికి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందా యని, ఎన్నికలలో మోసపురితా హామీలతో ఎత్తుల పోత్తులతో చంద్రబాబు గద్దెనెక్కి ప్రజలను మోసం చేసాడని అన్నారు. చంద్రబాబు షూరిటీ మోసం గ్యారంటీ అని ప్రజలు తెలుసుకున్నారని, అబద్దాలు ఆడటంలో, మోసం చేయడంలో అబ్బకొడుకులు అచ్చు బొమ్మ లాంటి వాళ్ళని, బాప్ ఏక్ నెంబర్ అయితే బేటా దో నెంబర్ అని ఘాటుగా విమర్శించారు.ఏడాది పాలనలోనే దోచుకునే దోపిడీ చేసే పాలన గుట్టు రట్టాయిందని, ప్రజలు రికాల్ ప్రకటించారాని, ఇప్పటికి జగనన్న ను ప్రజలు ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని అన్నారు.జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచెపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షమానికి నిలువుటద్దం, మారుపేరు జగనన్న అని, అబద్దాలకు, మోసానికి, నమ్మకద్రోహనికి చిరునామా చంద్రబాబాని విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజాలమదిలోరాజన్న బిడ్డడు సంక్షేమ ప్రధాతగా నిలిచి పోయడాని,నీ కళ్ళ బొల్లు మాటలు ప్రజలు నమ్మరని అన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కారణం కర్మ, కర్త, క్రియ, జగనన్న అన్న విషయం, ఆంధ్రప్రదేశ్ లోసంక్షేమ పథకాల సృష్టి కర్త మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగనన్న అనిపక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం కీర్తించారని అన్నారు. నోరు తెరిస్తే, నిదురలేస్తే చంద్రబాబు బాబు అబద్దాల జపం జపిస్తారని ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు.యం యల్ ఏ తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ మోసం అనే పదానికి అర్ధం చంద్రబాబాని నేడు రాష్ట్రంలోని ప్రజలందరూ నయవంచక, మోసపురితా పాలనలో అల్లాడుతున్నారని, ఏడాదిలోనే ఇంతటి వ్యతిరేకత ఏ ముఖ్యమంత్రికి రాలేదన్నారు. కూటమి దోస్థితో, కుట్రలమోసపురితా హామీలతో పాలన చేసే ప్రభుత్వం బూతు పుస్తకానికి దేవుడి బొమ్మ అట్ట వేసినట్టుగా ఉందని విమర్శించారు.



ఈకార్యక్రమంలో మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, ఆళ్ళ ఆంజినేయరెడ్డి, ఎంపీపీ దొంత కిరాణగౌడ్, వైసీపీ జిల్లా నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, మహిళా రాష్ట్ర నాయకులు ఉడుముల అరుణ, ఉడుముల శ్రనివాసరెడ్డి, సర్పంచ్ అరుణబాయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలికల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్







**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 19**

మార్కాపురంలోని ఎస్సీ బాలికల హాస్టలును జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహం ప్రాంగణంలో సదుపాయాలు, ఆహార నాణ్యత పై ఆరా తీశారు. వంటగదిని ప్రత్యేకంగా పరిశీలించారు.ఏకాంతంగా విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి విద్యార్థుల అభిప్రాయాలను తీసుకున్నారు. తాగునీటి నాణ్యతలో నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు ఏదైనా సమస్య ఉంటే కంప్లైంట్ రాసి బాక్సు లో వేయాలని విద్యార్థినులకు ఆమె సూచించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు అందరు సహకరించాలి -ఎస్సై నాగరాజు

**కొమరోలు పెన్ పవర్, జూలై 19**

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించడానికి వ్యాపారస్తులు వినియోగదారులు కూడా తమ వంతు సహకారం అందించాలని కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ఇబ్బందులను సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో కలిసి కొమరోలు పట్టణంలో పర్యటించారు.ఆ సందర్భంగా ఆయన కొమరోలు లోని వ్యాపార సంస్థలను, విద్యాసంస్థలను, ప్రభుత్వ వైద్యశాలలను సందర్శించి ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించడంతోపాటు వినియోగించి విసిరివేసిన ప్లాస్టిక్ వస్తువులను పారిశుద్ధ కార్మికులతో సేకరింపజేశారు .ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని, అలాగే వస్తువుల కొనుగోలుకు వచ్చే వినియోగదారులకు కవర్లు ఇవ్వవద్దని ఆయన వ్యాపారస్తులను కోరారు, దుకాణాలకు వచ్చి వినియోగదారులు వస్త్రంతో తయారుచేసిన సంచులను తెచ్చుకోవాల్సిందిగా వారికి వివరించాలని కోరారు .ప్లాస్టిక్ వినియోగం వలన అనేక సమస్యలు ,అనర్ధాలు ఉత్పన్నమవుతాయని, అందువల్ల ప్లాస్టిక్ రహిత సమ సమాజాన్ని నిర్మించేందుకు సహకరించాలని ఆయన కోరారు.అనంతరం ప్రధాన రోడ్ల కూడలి లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన వినియోగదారులతో, వ్యాపారస్తులతో ప్లాస్టిక్ నిషేధాన్ని అందరం పాటిస్తామని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఎస్సై నాగరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో వివిధ రకాల తినుబండారాలను తీసుకెళ్లి ఖాళీ ప్లాస్టిక్ కవర్లను బహిరంగ ప్రదేశాలలో ,చెత్తాచెదారపు కుప్పలలో వేస్తున్నారని అయితే వాటిలోని మిగులు ఆహార పదార్థాలకు ఆశపడి పశువులు వాటిని





తింటున్నాయని తెలిపారు.ప్లాస్టిక్ కవర్లు పశువుల జీర్ణాశయంలోనికి చేరి అవి జీర్ణం కాక పశువుల ప్రాణాలకు ముప్పు తెచ్చి పెడుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు పశువులకు ప్రాణాంతకమైన వ్యాధులకు కారణమవుతున్నాయని వివరించారు. దీనితో విలువైన పశువులు మృతి చెందుతూ పశుపోషకులకు తీరని దుఃఖాన్ని కష్టనష్టాలను తెచ్చిపెడుతున్నాయనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. అంతేకాక హోటల్లు రెస్టారెంట్లు వేడివేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో కట్టి వినియోగదారులకు ఇస్తున్నారని , ప్లాస్టిక్ కవర్లోని ఆహార పదార్థాలు చాలా సమయం నిలువ ఉంచడం వలన ఆహార పదార్థాలు కలుషితమై ప్రజలకు కూడా అనేక ప్రాణాంతకమైన వ్యాధులకు గురి చేసే ప్రమాదం కూడా లేకపోలేదని ఆయన పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్ల లోని ఆహార పదార్థాలను వాడడం వల్ల క్యాన్సర్ లాంటి అతి ప్రమాదకరమైన వ్యాధులు కూడా సంభవిస్తాయని డాక్టర్ హెచ్చరిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. కావున అన్ని రకాల వ్యాపారస్తులు ,వినియోగదారులు, సాధారణ ప్రజలు సైతం ప్లాస్టిక్ నిషేధాన్ని తూ.చా తప్పక పాటిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన కోరారు. దుకాణాలకు కూరగాయల మార్కెట్ కు వెళ్లే వినియోగదారులు వస్తువులను తెచ్చుకునేందుకు తమ వెంట నూలు వస్త్రంతో తయారుచేసిన చేతి సంచులను తీసుకెళ్లాలని ఆయన సూచించారు. వివాహాది శుభకార్యాలలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు తదితర వాటిని వినియోగించవద్దని, వ్యాపారస్తులు కూడా వాటిని విక్రయించవద్దని ఆయన కోరారు . వినియోగించి వదిలేసిన ప్లాస్టిక్ కవర్లు ,ప్లేట్లు, గ్లాసులు తదితర వాటిని తొలగించేవారు ముందు జాగ్రత్త చర్యగా చేతులకు గ్లౌజులు వినియోగించి, ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుళ్లు పీరయ్య, వీరభద్ర, శివ రామకృష్ణ తోపాటు పలువురు కానిస్టేబుల్లు, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

## తాటిపర్తి నోరు అదుపులో పెట్టుకో

### తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే



**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పోలీట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పై ఎర్రగొండపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ అనవసరంగా నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే హెచ్చరించారు. తాటిపర్తి చంద్రశేఖర్ లాగా పదవి కోసం పది పార్టీలు మారే మనస్తత్వం వర్ల రామయ్య కాదని నీతికి , నిజాయితీకి మారుపేరుగా వర్ల రామయ్య నిలిచారని మోషే గుర్తు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి మా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే టికెట్ నిరాకరిస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాన చేరిన నువ్వు 2019 - 2024 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగితే ఏనాడు నోరు మెదపని నువ్వు వర్ల రామయ్య గురించి మాట్లాడతా చంద్రశేఖర్ అంటూ మోషే ద్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగల పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి వర్గీకరణకు సానుకూలమైన వాతావరణాన్ని వర్ల రామయ్య కల్పించారనే విషయాన్ని చంద్రశేఖర్ గుర్తుంచుకోవాలని మోషే మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి తో ఎస్సీ వర్గీకరణ విషయం మీద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని కూడా చెప్పించలేని కుహానా నాయకులారా మీరా వర్ల రామయ్యను విమర్శించేది అని చంద్ర శేఖర్ పై మోషే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# మార్కాపురంలో మంత్రి, కలెక్టర్ పర్యటన

## ఐ.సి.యు, థైరాయిడ్ మిషన్‌లు ప్రారంభం -నూతన సీసీ రోడ్లలకు శంకుస్థాపన






**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్, జులై 19:**

స్థానిక గడియార స్తంభం సెంటర్ లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారీయా, స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ సిబ్బందికి సన్మానం చేశారు. అనంతరం గడియార స్తంభం వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మార్కాపురం సర్వజన వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ సి యు, థైరాయిడ్ మిషన్ లను మంత్రి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ సొంత నిధులతో ఐసీయూను స్థానిక శాసనసభ్యుల ఏర్పాటు చేయటం హర్షనీయమని అన్నారు. తర్లపాడు మండలంలోని మండల కేంద్రమైన తర్లపాడు లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ల్యాబ్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి , శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణ రెడ్డి ప్రారంభించారు. తర్లపాడు గ్రామంలోని ఎస్సీ పాలెం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాల గురించి వివరించారు. తొర్రపాడు మండలంలోని సీతా నాగులవరం గ్రామంలో నూతనంగా 25 లక్షలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో నూతనంగా 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఆయా మండలాల గ్రామాల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నివారించాలి

**బట్టతో, నారతో చేసిన సంచులను వినియోగించాలి: మంత్రి డోల**

**ప్రభుత్వ కార్యాలయాలలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ఆదేశాలు ఇచ్చాం: కలెక్టర్**

**ప్లాస్టిక్ వినియోగ రహిత మార్కాపురం ఆవిష్కరణకు ప్రజలందరూ సహకరించాలి: ఎమ్మెల్యే**






**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జులై 19**

ప్లాస్టిక్ వినియోగం వలన ఆరోగ్యానికీ, పర్యావరణానికీ ప్రమాదమని, ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలిసి శనివారం మార్కాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని, ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని ప్రజలకు చెప్పారు. ప్రతినెలా మూడో శనివారం ' స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర 'లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో ' ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం ' అనే ఇతివృత్తంతో ఈ నెలలో అవగాహన కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మార్కెట్ కు వచ్చే ప్రజలు సాధ్యమైనంతవరకు బట్టతో, నారతో చేసిన సంచులను వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. అనివార్యమైతే ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు తయారుచేసిన పునర్వినియోగించే అవకాశం ఉన్న ప్లాస్టిక్ మాత్రమే వాడాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇస్తున్న దుకాణాలపై పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి, నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి మార్గ నిర్దేశం చేశారు. ఇలా ఎక్కువ రికవరీ చేస్తూ, చురుకుగా వ్యవహరిస్తూ, మెరుగైన పనితీరు చూపిన సిబ్బందికి ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక అవార్డు ఇస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను కాకుండా ప్రత్యామ్నాయాల వినియోగంపై ప్రజలు దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో కలెక్టరేట్ నుంచే దీనిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకే మార్కాపురంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగ రహిత మార్కాపురం ఆవిష్కరణకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యల వలన ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ కొంత మార్పు వచ్చిందని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మార్కెట్లోని దుకాణాలను సందర్శించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని షాపుల యజమానులకు వారు సూచించారు. వీటి వలన కలిగే అనర్థాలను వివరించారు. మున్సిపాలిటీలో ఉత్తమ పనితీరు చూపుతున్న ఐదుగురు శానిటేషన్ సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే సన్మానించారు. ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన అవగాహన ర్యాలీని కూడా వారు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కాలుష్యకారక ప్లాస్టిక్ ను తాము వినియోగించబోమని, పర్యావరణాన్ని కాపాడుకునే విషయంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తామని ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రీ. సహదిత్ వెంకట త్రివినాగ్, జడ్పీ సీఈవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, తహసిల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాగును తలపిస్తున్న రాహదారి

**కొనకనమిట్ల పెన్ పవర్ జులై 19**



కొనకనమిట్ల మండలం మర్రిపాలెం గ్రామంలోని ప్రధాన రహదారి వర్షం పడితే చాలు చిన్న పాటి వాగును తలపిస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పాటి వర్షం కురిసినప్పటికీ సైడ్ కాలువలు లేకపోవడంతో రహదారిపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. వర్షం పడిన ప్రతిసారి ఇళ్లలో నుండి బయటకు కూడా రాలేని పరిస్తితి ఏర్పడుతుందని పాఠశాలలకు వెళ్ళే పిల్లలు సైతం నడిచి వెళ్ళాలంటే ఇబ్బందిగా మారిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలు మార్లు పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి స్పందించడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ అధికారులు ఒక్కసారి గ్రామంలోని రోడ్లను పరిశీలిస్తే సమస్య ఉందో లేదో వారికే తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆమ్ ఆద్మీ కార్యాలయం పై దాడి చేసిన వారిని వెంటనే పట్టుకోవాలి

### ఆమ్ ఆద్మీ నేత నేతి మహేశ్వర రావు

**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

ఆమ్ ఆద్మీ కార్యాలయం పై దాడి చేసిన దుండగులను వెంటనే పట్టుకోవాలని ఆమ్ ఆద్మీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వర రావు కోరారు. శనివారం తన కార్యాలయం పై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారని రూరల్ పోలీస్ స్టేషన్లో మహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అనంతరం మహేశ్వరరావు మాట్లాడుతూఅమ్ ఆద్మీ పార్టీ ఆఫీసు తాళం పగలగొట్టి ఆఫీస్ లోకి వచ్చి కుర్చీలను పడేసి వెళ్లిన విధానం ముఖ్యంగా విలువైన కెమెరా విలువైన అలాగే విలువైన వస్తువులు ఉన్నా కూడా విలువైన వస్తువులను తీసుకెళ్లలేదు అంటే వచ్చిన వాళ్ళు దొంగలు కాదు అన్న అనుమానం కలుగుతుంది అని అన్నారు. ఎవరో కావాలనే ఉద్దేశపూర్వకంగానే తన కార్యాలయం ను ధ్వంసం చేసినట్లు మహేశ్వరం అనుమానం వ్యక్తం చేశారు. కరేడు రైతుల భూముల విషయంలో అలాగే లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల పరిధిలో భూములను జిందాల్ కంపెనీకి కట్టబెట్టే అంశంలో రెండు పార్టీలు సిండికేట్ గా తయారై పనిచేస్తున్నాయి అన్న అంశం మీద నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో ఇలా జరగడం అనుమానాలకు ఆస్కారం ఇస్తుంది అని అన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి అలాగే పోలీస్ అధికారులకు వచ్చిన వాళ్ల దొంగల లేదా ఇంకా ఏమన్నా ఉద్దేశంతో వచ్చారా అన్నదానిమీద లోతైన విచారణ చేయవలసిందిగా కోరారు. మహేశ్వరరావు వెంట దళిత నాయకుడు పాలేటి కోటేశ్వరరావు, సిపిఐ నేత బూసి సురేష్ బాబు ఉన్నారు.




## పుల్లల చెరువు మండల వైసీపీ కన్వీనర్‌గా దోమకాల నియామకం



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 19**

పుల్లల చెరువు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా దోమకాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకాన్ని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటి పర్తి చంద్రశేఖర్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రతిపక్షంగా నిలిచి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తాను. నాయకత్వం ఇస్తున్న బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ, పార్టీ సిద్ధాంతాలు, దిశానిర్దేశం మేరకు నిస్వార్థంగా పనిచేస్తాను. ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. వెంకటేశ్వర్లును మండల కన్వీనర్‌గా నియమించడం పట్ల స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శాలువలతో సన్మానించి, ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీకి నిబద్ధతగల నాయకుడిగా ఆయన సేవలు మరింత బలోపేతం అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




**కందుకూరు పెన్ పవర్, జూలై 19**

నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని మోపాడు గ్రామంలో శనివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి వైపు దూసుకెళ్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులైన రోడ్లు, కాలువలు ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని తెలియజేశారు. గ్రామంలో ఇంకేమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినచో వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలియజేశారు. త్వరలోనే సొంత స్థలం ఉన్న వారికి హౌసింగ్ స్కీమ్ ద్వారా ఇల్లు నిర్మిస్తామని, ఇంటి స్థలాలు లేని వారికి లేని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇల్లు కట్టిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల జరిగిన నష్టాలను బట్టి భర్తీ చేసుకుంటూ ఆర్థిక లోటు పాటులను సరిచేసుకుంటూ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ ముందుకు కూటమి ప్రభుత్వం వెళ్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రతి పేద వారి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించాలని సంకల్పంతో పనిచేస్తుందని ఏడాది కూటమి పాలనలో అన్ని వర్గాల్లో ఎంతో ఆనందంగా ఉన్నారని ముఖ్యంగా మహిళలు వృద్ధులు, విద్యార్థులు యువతకు నేరుగా సంక్షేమ పథకాలను అందించడంతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో పాడి రైతుల కోసం గోకులం షెడ్లు, సబ్సిడి కింద యంత్ర పరికరాలు , బీసీ ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి కొరకు బ్యాంకు లోన్లు ఇలా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ పార్టీ నాయకులు రావుల రవి, తన్నీరు ఏడుకొండలు, బెల్లంకొండ సింగయ్య, తోకల వీరేష్, బోడపాటి నారాయణ చెన్నారెడ్డి ఆదిశేషు , గుళ్ళా శ్రీనివాసులు, సూరం చిరంజీవి రెడ్డి, వీరారెడ్డి, మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.